క్లుప్తంగా

వెంకన్న హుండీ ఆదాయం రూ.7.87 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో స్వామి వారికి దేవస్థానంలోని 9 హుండీల ద్వారా రూ.7,87,566 ఆదాయం సమకూరింది. కాగా ఈ ఆలయంలో గత నెల 18న చివరిసారిగా హుండీ ఆదాయం లెక్కించగా ప్రస్తుతం వచ్చిన ఆదాయం 41 రోజులకు గానూ వచ్చినట్లయ్యింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయ-ధర్మాదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సురేష కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ఈతకోట శ్రీనివాస రావు, వీవీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): స్థానిక స్థానిక వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్) వద్ద విభిన్న ప్రతిభావంతుల కోసం బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉన్న 19–30 సంవత్సరాల వయసు ఉన్న వారు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని వివరించారు. ఇతర వివరాలకు 92810 97229, 94934 82414, 8978 524022, 94400 42901 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అనుమతుల్లేని సర్వీసింగ్ సెంటర్‌ను తొలగించాలి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురం చెరువుకు మంచినీటిని తరలించే పంట బోదెపై ఎటువంటి అనుమతులు లేకుండా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వాహనాల శుభ్రం చేయడం వల్ల నీరు కలుషితమవుతోందని, దీని వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పలువురు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేసారు. ఆ సర్వీసింగ్ కేంద్రాన్ని వెంటనే తొలగించాలని ఏలూరులోని కలెక్టర్ కార్యాలయంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతు పెద్దిరెడ్డి భోగయ్య ఫిర్యాదు చేసారు. సర్వీసింగ్ సెంటర్‌లో వాహనాలను శుభ్రం చేయడం వల్ల అందులోని గ్రీజు, దుమ్ము అంతా బోదెలోంచి మంచి నీటి చెరువులోకి చేరుతోందని తెలిపారు. దీంతో చెరువులోని నీరంతా రంగు మారి దుర్వాసన కొడుతుందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పంట బోదెపై తూర ఏర్పాటు చేసారని, నాలుగు ఫిల్టర్లతో పెద్ద దిమ్మను నిర్మించారని, దీని వల్ల పంట పొలాలకు నీటి ప్రవాహం తగ్గుతోందని వారు పేర్కొన్నారు. అదే మాదిరిగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని నాయకులు మంగళవారం కోరారు.

కొనసాగుతున్న రైల్వే ట్రాక్ మరమ్మతులు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతు పనులు మరో మూడురోజులు పొడిగి స్తూ రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం నిర్ణయంతీసుకున్నారు. దీనితో ఇంకా మూడు రోజులు రైల్వే గేటు మూతపడనుంది. వాస్తవానికి ఈనెల 22వ తేదీ నుంచి 30వ తేదీ నాటికి పనులు పూర్తి కావాల్సింది. పనులు పూర్తి చేసేందుకు సాంకేతిక సమస్యల రీత్యా వచ్చే నెల మూడో తేదీ వరకు రైల్వే గేటును మూసి వేయాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. దీంతో ఈ గేటు మీదుగా ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు, వాహనదారులు, రైతులు, ప్రజలు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వ్యయ ప్రయాసలు భరించాల్సి ఉంది.

గోతులతో నరకయాతన

- ఏలూరు పరిధిలోని రోడ్లన్నీ గోతులమయం
- మాటలకే పరిమితమైన కూటమి నేతలు



చొదిమెళ్ల-వంగూరు రహదారి దుస్థితి



గోతులతో దర్శనమిస్తున్న చొదిమెళ్ల బైపాస్ రోడ్డు

ఏలూరు (టూటౌన్): ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం అన్న చందంగా ఏలూరు నగరం, దాని పరిసరాల రోడ్లు దర్శనమిస్తున్నాయి. నెలరోజుల్లోనే గుంతలరహిత రోడ్ల నిర్మాణమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యం అంటూ ఊకదంపుడు ప్రచారం నిర్వహించిన పాలకులు మొక్కుబడిగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు నుంచి బయట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటు లోకల్ రోడ్డు అనే తేడా లేకుండా అన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలకులు చెప్పినట్లు ఒకటి రెండు పనులు చేసినా అవి కొద్ది రోజులకే మళ్లీ యథావిధిగా గోతులతో దర్శనమిస్తున్నాయి. పూడ్చిన చోట రాళ్లు, దుమ్ము,ఇ సుక పైకి తేలి వాహనదారులకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. పగటి వేళ ఏదో రకంగా సర్దుకుపోయినా రాత్రి సమయంలో వాహనదారులకు భంగపాటు తప్పడం లేదు. అనేక సార్లు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లే సమయంలో జారిపడిపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పాలకుల తీరును ఏలూరు నగర, పరిసర గ్రామాల ప్రజలు తప్పుబడుతున్నారు. తక్షణం రోడ్లను మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

కన్నెత్తి చూడని ఆర్‌అండ్‌బీ అధికారులు

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రోడ్లు సైతం రహదారులు, భవనాల శాఖల అధికారులు బాగు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. చొదిమెళ్ల నుంచి వంగూరు అడ్డ రోడ్డు ప్రధాన రహదారిపై వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. అదేవిధంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని చొదిమెళ్ల నుంచి బైపాస్ రోడ్డు వరకు ఎన్నో రోజులుగా పాడైపోయిన రోడ్డును వేయకపోవడంపై అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఈ మార్గాల్లో నిరంతరం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. మరోవైపు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. నగరపాలక సంస్థ రహదారులు, ఆర్ అండ్‌బీ శాఖకు సంబంధించిన రోడ్ల సరిహద్దుల్లో వారు చేస్తారులే అని వీరు, వీరు చేస్తారులేనని వారు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తుండడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి.

పాలన సూపర్ అంటూ గొప్పలు

ఓ వైపు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తికావస్తుండడంతో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు సమావేశాలు పెట్టి మరీ గొప్పలు చెప్పుకుంటున్నా రోడ్ల పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిని గొంగళి అక్కడే ఉన్న విధంగా ఉంది. హడావుడి, ప్రచార ఆర్భాటం మినహా కూటమి పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏంటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గోతులమయంగా ప్రధాన రహదారులు

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ గోతులతో దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్, ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట, అశోక్‌నగర్, కండ్రిగ గూడెం, తంగెళ్లమూడి, ఎన్ఆర్‌పేట, గ్జేవియర్ నగర్, విద్యానగర్, శాంతినగర్ రోడ్లు ఎక్కడికక్కడ గోతులు పడి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలుగ జేస్తున్నాయి. తక్షణం నగరపాలక సంస్థ అధికారులు రోడ్లు మరమ్మతులు చేసి ప్రజల అసౌకర్యాన్ని తీర్చాలని కోరుతున్నారు.

తక్షణం మరమ్మతులు చేయాలి



చొదిమెళ్ల–వంగూరు రహదారిలో నిత్యం ద్విచక్రవాహనంపై ప్రయాణం సాగిస్తుంటాను. వంగూరు అడ్డరోడ్డు వద్ద పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. కనీసం వీటిని పూడ్చి మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఎవరో ఒకరు జారి పడుతున్నారు. తక్షణం రోడ్ల మరమ్మతులను చేపట్టాలి. – బి.నాగరాజు,వాహనదారుడు,ఏలూరు

రోడ్లన్నీ అధ్వానం



ఏలూరు పరిసర గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ చాలా అధ్వానంగా ఉన్నాయి. తక్షణం వాటిని రిపేర్లు చేయాలి. నగరపాలక సంస్థ, ఆర్‌అండ్‌బీ శాఖలకు సంబంధించిన సరిహద్దు ప్రాంతాల్లో వారు చేస్తారులే అని వీరు, వీరు చేస్తారులేనని వారు పూర్తిగా వదిలేస్తున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. – గారాపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలకు ఏలూరులో 5 పరీక్షా కేంద్రాలు, జవహర్ నవోదయ విద్యాలయంలో ఒక కేంద్రం కేటాయించామని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో 9వ తరగతి ప్రవేశాలకు మొత్తం 1007 మంది, 11వ తరగతి ప్రవేశాలకి 635 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94907 28768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పదోన్నతులు, కారుణ్య నియామకాలు అందిస్తున్నామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో పదోన్నతులు పొందిన సిబ్బందికి ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ అందజేశారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ తాను ఇప్పటివరకు వివిధ కేడర్లలో 61 మందికి పదోన్నతులు కల్పించామని, 55 మందికి కారుణ్య నియామకాలు అందించామన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు బ్రిడ్జి కోర్సు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఐటీఐ రెండు సంవత్సరాలు చదివి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో చేరడానికి ఎంపిక చేసిన ప్రభుత్వ ఐటీఐలలో బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నట్లు ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ప్రధానాధికారి పి.జిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్రిడ్జి కోర్సు వచ్చే ఫిబ్రవరి 21 వరకూ నిర్వహిస్తామన్నారు. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన వారికి ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఆయా సంస్థల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న ఐటీఐ అభ్యర్థులు ఇతర వివరాలకు తమకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రధాన అధికారులను సంప్రదించాలని కోరారు.

ఎంపీటీసీల గౌరవ వేతనాలపై బిల్లులు పెట్టాం

దెందులూరు: మండలంలో ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించి బిల్లులను ప్రభుత్వానికి పంపించామని దెందులూరు ఎంపీడీవో కె.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. బిల్లులు మంజూరైన వెంటనే వారి బ్యాంకు ఖాతాకు జమవుతాయని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఆత్మీయ సమావేశం



వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో ఏలూరు సమన్వయకర్త జేపీ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లల్లో సంక్షేమ పాలనతో ప్రజలను సుభిక్షంగా పరిపాలిస్తే నేటి కూటమి సర్కారు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి సంక్షోభంలోకి నెట్టిందని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌తో పాటు నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఏలూరు నగర అధ్యక్షుడితో మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో వేలాది కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించామని నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలైనా ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. సంపద సృష్టించి పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తామంటూ ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు నిధులు లేవని, సంక్షేమ పథకాలు అమలు చేయలేమంటూ నిస్సుగ్గగా చెబుతున్నారని విమర్శించారు. ప్రజల పక్షాన రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పోరాటం చేస్తామని, ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రజల పక్షాన నిలబడతామని తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు బాచి, జిల్లా వికలాంగుల అధ్యక్షుడు ఎస్‌కే సమీమ్, జిల్లా నాయకులు బుద్దాల రాము, జనార్దన్, బత్తిన మస్తాన్, తులసి, స్టేట్ మున్సిపల్ వింగ్ సెక్రటరీ తంగెళ్ల రాము, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, సముద్రాల దుర్గారావు, యువజన విభాగం అధ్యక్షుడు గంటా సాయి శివప్రదీప్, మహిళా విభాగం అధ్యక్షురాలు జిజ్జువరపు విజయ నిర్మల, బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్ బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దేవరకొండ నాగేశ్వరరావు, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ కైసర్ పాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మదిరి ఫ్రాన్సిస్ గ్జేవియర్, వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడు యల్లావర్జుల ఎస్‌వీ శివరావు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాతినవలస బాల గురువేంద్రకుమార్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు అట్బాడ రామకృష్ణ, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు పాతినవలస రాజేష్ (కరుణ), వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడు ఉయ్యాల గణేష్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాల మీఎస్‌టీ ఫణి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడుగా కొండపల్లి పరమేశ్వరరావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడు చీలి అంథోనమ్మ (బుజ్జమ్మ), లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు మేతర సురేష్‌బాబు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు పచ్చిపులుసు సృజన్, ఐటీ వింగ్ అధ్యక్షుడు పిల్లం గోళ్ళ వెంకట సత్యదేవ్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు బత్తిలి నాగేశ్వరరావు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు కొవ్వాడ దుర్గారావు, ఇంటలెక్చువల్స్ ఫామ్స్ వింగ్ అధ్యక్షుడు లంకాబత్తిన యేసుపాదం , పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు కొల్లిపర భగవాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్థానిక ప్రజాప్రతినిధుల శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి జరగాలని, స్థానిక సంస్థలు బలంగా ఉండాలని ఏలూరు రూరల్ మండలపరిషత్ అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు(జీడీపీడీ) అంశంపై సర్పంచ్, ఎంపీటీసీలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీలత మాట్లాడుతూ సర్పంచ్, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామపెద్దలు, ప్రజలు కలిసి చర్చించుకుని ప్రతి ఏడాది గ్రామంలో చేపట్టబయే అభివృద్ధి పనులపై ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రణాళిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తాయన్నారు. ప్రణాళికలో లేని పనులకు నిధులు అందుబాటులో ఉండవన్నారు. దీన్ని గుర్తించి ముందుగానే పాలకవర్గాలు ప్రత్యేక దృష్టి నిలిపి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న సర్పంచ్ గుడిపూడి రఘు మాట్లాడుతూ గత ప్రభుత్వ సహకారంతో కోట్ల రూపాయలు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంకులు, ఊరంతా తాగునీటి పైప్‌లైన్, సీసీరోడ్లు, జడ్పీ పాఠశాల తరగతి గదులు, ఫిల్టర్‌బెడ్లు అభివృద్ధి చేసామన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో ప్రత్యేక నిధులు ఊసే లేదన్నారు. పంచాయతీ నిధులు కేవలం సిబ్బంది జీతాలకే సరిపోతుందన్నారు. సర్పంచ్, పాలకవర్గ సభ్యులను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సైతం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు.

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

నిడమర్రు: కొల్లేరు అభయారణ్య పరిధిని 5 నుంచి 3 కాంటూరుకు కుదించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. మంగళవారం నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం పార్టీ మండల సమావేశం గవర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కొల్లేరు పరిధిని 5 నుంచి 3వ కాంటూరుకు కుదిస్తామని, ప్రజల జీవన విధానాన్ని కాపాడతామని కేంద్ర రాష్ట్ర పాలక పార్టీలు చట్ట సభల్లో తీర్మానాలు చేస్తున్నారేగానీ అమల్లో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కొల్లేరు ప్రజల కష్టాలు తీరాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైన ఇబ్బందులు లేకుండా న్యాయస్థానాల్లో పోరాడాలన్నారు. ఇప్పటికే రాజకీయ నాయకుల అండతో రైతుల ముసుగులో వలసదారులు కొల్లేరులో చేపట్టిన అక్రమ తవ్వకాలను అధికారులు నియంత్రించాలన్నారు. కొల్లేరులో భూములున్న రైతుల హక్కులను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, కంచం వరప్రసాద్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై కేసుల నమోదు



నగరంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో తనిఖీ నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు వాటర్ ప్లాంట్లపై విజిలెన్సు, ఆహార తనిఖీ అధికారులు, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి. శ్రీరాం బాబు ఆదేశాల మేరకు ఏలూరు నగరంలోని పలు ప్రైవేట్ తాగు నీటి సరఫరా కేంద్రాల్లో (వాటర్ ప్లాంట్స్) తనిఖీ చేయగా మెస్సర్స్ యువన్ బెవరేజస్ (9 డ్రాప్స్), మెస్సర్స్ గంగా బెవరేజస్ వాటర్ ప్లాంట్లలో తయారీ తేదీ లేకుండా ప్యాకింగ్ చేస్తున్న మిస్ బ్రాండ్ వాటర్ బాటిల్స్, పాకెట్స్, యూనిట్ సేల్ ప్రైస్ లేని వాటర్ బాటిల్స్, నిమ్మ సోడా బాటిల్స్‌ను గుర్తించారు. ఈ మేరకు ఆయా ప్లాంట్లపై ఆహార భద్రతా చట్టం ప్రకారం, తూనికలు కొలతలు చట్ట ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్స్ పి.శివరామ కృష్ణ, డి.ప్రసాద కుమార్, విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, ఎస్సై కె. సీతారాము, ఆహార తనిఖీ అధికారులు కె.రామరాజు, డీవీ కావ్యరెడ్డి, తూనికలు కొలతల అధికారి వి. ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్ పరీక్షలు



కైకరం జెడ్పీహెచ్ఎస్ ఎన్‌సీసీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్–19 పరిధిలోని కైకరం జెడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు మంగళవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు కై కరం జెడ్పీహైస్కూల్ నుంచి 64 మంది, గుండుగొలను నుంచి 38 మంది, నల్లజర్ల ఏకేఆర్‌జే నుంచి 64 మంది మొత్తం 166 మంది హాజరయ్యారు. ఈ క్యాడెట్లకు రెండేళ్ల పాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మాప్ రీడింగ్ శిక్షణ అందించారు. ఎన్‌సీసీ–ఎ సర్టిఫికెట్ పొందేందుకు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షను లెఫ్టినెంట్ కల్నల్ రిషిబ్ సిన్హా, ఇతర ఎన్‌సీసీ అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సీసీ ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని కైకరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జి.గవరయ్య, కేజీ భీమేశ్వరరావు, మహబూబ్ వల్లి పాల్గొన్నారు.

ఆత్మరక్షణ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న బాలికలకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ పేరిట ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకూ శిక్షణ ఇవ్వడానికి ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థల్లో స్వీయ రక్షణ శిక్షణ నిర్వహించడంలో ఏజెన్సీలకు ముందస్తు అనుభవం ఉండాలని, శిక్షకులకు తప్పనిసరిగా కనీసం ఒక మార్షల్ ఆర్ట్ లేదా ఆత్మరక్షణ క్రమశిక్షణలో (తైక్వాండో, కరాటే, జూడో) సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 30 సాయంత్రం 5 గంటల లోపు ఏలూరులోని జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మానసిక ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు

ఉంగుటూరు: పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి ఎక్కువై యువత అనేక ఇబ్బందులు పడుతున్నారని, చివరకు ఆత్మహత్య వరకు వెళుతున్నారని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్ (హెచ్ఏఎఫ్ఏ-యూఎస్ఏ) గ్రూప్ ఆఫ్ డాక్టర్స్‌తో కలిసి సంయుక్తంగా మెంటల్ వెల్నెస్ అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ ఆన్‌లైన్ వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాంకులు, మార్కుల కోసం పోటీపడడమే కాకుండా వ్యసనాలకు బానిసలుగా మారి మానసిక ఒత్తిడి గురవుతున్నారని, మానసిక రోగులుగా మారుతున్న వారిలో ఎక్కువ శాతం యువత ఉంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక రోగాల బారి నుంచి బయటపడటానికి ఇటువంటి వెబినార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ముఖ్య వక్త అమెరికా దేశంలోని కరోలినా యూనివర్సిటీ, డ్యూక్ యూనివర్సిటీలో కార్డియాలజీ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ శ్రీవాణి రెడ్డి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి గుండె ఆరోగ్యంపై ప్రభావం చేపిస్తుందన్నారు. సిందూర్ అంబటి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలను విద్యార్థులకు వివరించారు. అమెరికాలో పెడియాట్రిక్స్ విభాగంలో సేవలందిస్తున్న డాక్టర్ ఆశ్రిత జొన్నలగడ్డ, ప్రముఖ మానసిక వైద్యురాలు మానస, మెంటల్ వెల్నెస్ ఆన్‌లైన్ వెబినార్ కన్వీనర్ డాక్టర్ కొండా రవి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

మట్టి పరీక్షల ద్వారా పెట్టుబడి వ్యయం ఆదా



సూరప్పగూడెంలో రైతులకు మట్టి పరీక్షా ఫలితాల పత్రాలను అందిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

భీమడోలు: మట్టి పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడి వ్యయం తగ్గి ఆర్థికంగా బలోపేతమవుతారని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. సూరప్పగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవోతో కలిసి రైతులు వరి పొలాలను సందర్శించారు. దాళ్వా సీజన్‌లో పంట సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యలు, వ్యవసాయశాఖ చేపట్టిన కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు మట్టి నమూనా పరీక్షా ఫలితాల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకురాలు షైలాభాను, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29